నమస్తే తెలంగాణ
# హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, సోమవారం 16 జూన్ 2025 | HYDERABAD



## వర్షసూచన

సిటీబ్యూరో, జూన్ 15 (నమస్తే తెలంగాణ): ఉపరితల ఆవర్తన ప్రభావంతో గ్రేటర్‌లోని పలు చోట్ల తేలిక పాటి నుంచి మోస్తరు వానలు కురిసే అవకాశాలున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. కాగా వర్షాల కారణంగా నగరంలో ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయికి చేరుకున్నాయి. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠం 31.0, కనిష్ఠం 23.7 డిగ్రీలు, గాలిలో తేమ 65 శాతంగా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.


## పార్కుల్లోకి ప్లాస్టిక్‌ను అనుమతించవద్దు

### ప్రధాన అటవీశాఖ అధికారి సువర్ణ .. కేబీఆర్ పార్కు సందర్శన

హైదరాబాద్, జూన్ 15 (నమస్తే తెలంగాణ) : అటవీశాఖ పార్కుల్లోకి ప్లాస్టిక్ కవర్లను, ప్లాస్టిక్‌తో తయారుచేసిన వస్తువులను అనుమతించవద్దని, వాటి నియంత్రణను అధికారులు సమర్థంగా అమలుచేయాలని ప్రధాన అటవీశాఖ అధికారి డాక్టర్ సువర్ణ ఆదేశించారు. ఆదివారం ఆమె కాసు బ్రహ్మానందరెడ్డి పార్కును సందర్శించారు. వాకర్స్‌తో ముచ్చటించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారికి కల్పించే వసతులు, సౌకర్యాల గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పార్కులోని నెమళ్లు, పావురాలకు బయటి ఆహారం పెట్టకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. పార్కులో కుక్కల బెడద తీవ్రంగా ఉందని వాకర్స్ చేసిన ఫిర్యాదును ఆమె పరిగణనలోకి తీసుకున్నారు. ఈ విషయంపై సంబంధిత అధికారులతో చర్చించి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీఎఫ్‌వోతో పాటు ఇతర ఉన్నతాధికారులు, వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రాణం తీసిన మృత్యు తీగలు

ఫుట్‌పాత్‌పై నిద్రిస్తున్న ఇద్దరిపై
తెగిపడిన 11 కేవీ కరెంటు తీగలు
ఇద్దరు యాచకుల సజీవ దహనం
చింతల్‌కుంటలో దుర్ఘటన



IIలో

# పర్యాటక స్థలాల్లో ప్రైవేట్ రాజ్యం..!

- గడువు ముగిసిన వారితోనే పారిశుద్ధ్య నిర్వహణ పనులు
- పర్యవేక్షణ లేమి.. కంపుకొడుతున్న పర్యాటక ప్రాంతాలు
- ఎక్స్ వేదికగా అపరిశుభ్రతను ఎత్తి చూపుతున్న పౌరులు
- 73 కిలోమీటర్లు ప్రైవేట్‌పరం .. తనిఖీలు మరిచిన అధికారులు

పర్యాటక స్థలాల పరిశుభ్రతపై జీహెచ్ఎంసీ శీతకన్ను వేసింది..పారిశుధ్య నిర్వహణలో ఉన్నతాధికారుల నిర్లక్ష్య వైఖరి కారణంగా దుర్గంధభరిత వాతావరణంలో పర్యాటక స్థలాలు దర్శనమిస్తున్నాయి. ప్లాస్టిక్ వ్యర్థాలకు తోడుగా చిరు వ్యాపారులు, తోపుడు బండ్ల నుంచి వచ్చే చెత్తను సకాలంలో ఎత్తివేయకపోవడంతో పర్యాటక స్థలాలు కంపుకొడుతున్నాయి. ఇటీవల కాలంలో ఎక్స్ వేదికగా పౌరులు పారిశుధ్య లోపాన్ని ఎత్తి చూపుతుండడం ఒకవైపు...మరోవైపు నిర్వహణ బాధ్యతలను ప్రైవేట్ ఏజెన్సీలకు ఇచ్చిన అధికారులు.. వాటి పనితీరు పట్ల పర్యవేక్షణ లోపించింది. అన్నింటి కంటే మించి రెండు ఏజెన్సీల నిర్వహణ గడువు ముగిసినప్పటికీ వారినే కొనసాగిస్తుండడం పట్ల తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. కొత్తగా టెండర్లు పిలిచి అర్హులైన ఏజెన్సీకి పనులు అప్పజెప్పాల్సిన అధికారులు.. పాతవారినే కొనసాగిస్తుండటం వెనుక మతలబు ఏంటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మొత్తం 73.75 కిలోమీటర్ల మేర పారిశుధ్యాన్ని ప్రైవేట్ పరం చేసి ప్రతి నెలా దాదాపు రూ. 2.40 కోట్ల మేర ఖర్చు చేస్తుండడం గమనార్హం.
– సిటీబ్యూరో, జూన్ 15 (నమస్తే తెలంగాణ ):



### తొమ్మిది ప్యాకేజీలుగా

పర్యాటక ప్రాంతాలు, వీవీఐపీ/వీఐపీలు, వాహనాల రద్దీ ఎక్కువగా ఉండే రోడ్ల పారిశుధ్య నిర్వహణను 73 కిలోమీటర్ల మేర రహదారులను అప్పగించారు. తొమ్మిది ప్యాకేజీలుగా విభజించి మూడేండ్ల పాటు రెండు ఏజెన్సీలకు బాధ్యతలు అప్పగించగా...దాదాపు ఏడాది కాలంగా కొత్త వారికి పనులు అప్పగించకుండా పాత వారితోనే కాలం వెళ్ల దీస్తున్న అధికారుల పనితీరుకు అద్దం పడుతున్నది. వాస్తవంగా 24 గంటలూ స్వీపింగ్ జరిగేలా మెక్‌లిన్, ఇక్సోరా కంపెనీలకు ఈ బాధ్యత అప్పగించారు. ఇందుకుగానూ కిలోమీటర్‌కు సగటున నెలకు రూ.3.12 లక్షలు ఖర్చు చేస్తున్నారు. వాస్తవంగా ఇదే పనిని కార్మికుల స్వీపింగ్‌కు నెలకు అయ్యే వ్యయం రూ.40వేలు మాత్రమే. కార్మికులతో పోలిస్తే ప్రైవేట్‌కు చెల్లిస్తున్నది ఎనిమిది రెట్లు అధికం. ఈ క్రమంలోనే ప్రస్తుతం కొనసాగుతున్న ప్రైవేట్ విధానంపై తీవ్ర స్థాయిలో ఆరోపణలు లేకపోలేదు.

### ప్రైవేట్‌పరం చేసిన పారిశుధ్య స్థలాలు ఇవే ...

| సర్కిల్ | పర్యాటక స్థలం | నిర్వహణ పొడవు (కిలోమీటర్లలో) |
|---|---|---|
| సంతోష్‌నగర్ | పైగా టూంబ్స్ | 2.9 |
| చార్మినార్ | చార్మినార్, సాలర్జంగ్, మక్కా మసీదు, చౌహమల్లా ప్యాలెస్ | 13 |
| కార్వాన్ | కుతుబుషాహీ టూంబ్స్, గోల్గొండ పోర్టు, బాపుఘాట్ | 13.5 |
| మెహిదీపట్నం | నాంపల్లి పబ్లిక్ గార్డెన్, అసెంబ్లీ | 4 |
| గోషామహల్ | ఎంజే మార్కెట్, సుల్తాన్ బజార్ క్లాక్ టవర్, ఎల్బీ స్టేడియం | 7 |
| ఖైరతాబాద్ | హుస్సేన్‌సాగర్, బిర్లా టెంపుల్, ఎల్లమ్మ టెంపుల్ | 10.2 |
| జూబ్లీహిల్స్ | కేబీఆర్ పార్కు, జూబ్లీహిల్స్ పెద్దమ్మ టెంపుల్ | 16.3 |
| శేరిలింగంపల్లి | దుర్గం చెరువు | 5.8 |
| బేగంపేట | సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ | 1.5 |

## నిర్వహణ లోపాలకు అమాయకులు బలి

- ప్రాణాల మీదకొస్తున్న విద్యుత్ శాఖ నిర్లక్ష్యం
- చింతల్‌కుంట ఘటనతో మరోసారి బయటపడ్డ వైఫల్యం
- సబ్‌స్టేషన్లలో పటిష్టంగా లేని భద్రతా వ్యవస్థ
- తప్పుదోవ పట్టిస్తున్న డిస్కం అధికారులు

హైదరాబాద్ ఎల్బీనగర్‌లో విషాదం నెలకొంది.. చింతల్‌కుంట ఏరియాలో ఆదివారం తెల్లవారుఝామున హైటెన్షన్ వైర్లు తెగిపడి ఇద్దరు యాచకులు సజీవదహనమయ్యారు. స్తంభానికి గుర్తుతెలియని వాహనం ఢీకొనడం వల్ల ఆ ఒత్తిడికి పిన్ ఇన్సులేటర్ రాడ్ విరిగిపడిందని విద్యుత్ అధికారులు తెలిపారు. 11కేవీ చింతల్‌కుంటకు సంబంధించిన పోల్‌మీదగల పాలిమర్ పిన్ ఇన్సులేటర్‌లోని మెటల్ రాడ్ దెబ్బతినడంతో విద్యుత్ తీగలు తెగిపడ్డాయని వారు చెప్పారు.

కీసర నాగారంలో గతనెల బైక్‌పై వెళ్తున్న భార్యాభర్తలతో పాటు వారి కుమారుడిపై విద్యుత్ తీగ తెగిపడింది. ఈదురుగాలులకు తీగ తెగి మీదపడడంతో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. అందులో భార్య చికిత్స పొందుతూ మృతిచెందింది.

రంగారెడ్డి జిల్లా మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని పల్లె చెరువు వద్ద నడుచుకుంటూ రోడ్డు దాటుతున్న ముఖేష్ అనే వ్యక్తిపై విద్యుత్ తీగలు తెగిపడడంతో అక్కడికక్కడే చనిపోయాడు.

చాదర్‌ఘాట్ చిన్నబ్రిడ్జ్‌పై ఏప్రిల్ 14వ తేదీన సాయంత్రం విద్యుత్ హైటెన్షన్ వైర్ తెగిపడింది. ఈదురుగాలులు వీయడంతో తీగలు తెగిపడినట్లుగా అధికారులు చెప్పారు. సరిగ్గా అదే సమయంలో అటుగా వెళ్తున్న వాహనదారుడికి తృటిలో ప్రమాదం తప్పింది.

IIలో

## ఛే నంబర్‌లో ప్రయాణం నిత్య నరకం



అందుబాటులోకి రాని సర్వీస్ రోడ్డు.. అవస్థలు పడుతున్న స్థానికులు

### పక్కా ప్రణాళిక లేకుండా అంబర్‌పేట ఫ్లై ఓవర్ నిర్మాణం

గోల్నాక, జూన్ 15: మహా నగరంలో ట్రాఫిక్ తగ్గించే చర్యల్లో భాగంగా అంబర్‌పేట ఫ్లై ఓవర్ నిర్మాణం చేపట్టారు. 8 ఏండ్లుగా ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు సాగడంతో అంబర్ పేట ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఎట్ట కేలకు ఇటీవలే ఫ్లై ఓవర్ అందుబాటులోకి వచ్చినా... పక్కా ప్రణాళిక కుండా ఏర్పాటు చేసిన ఫ్లై ఓవర్ నిర్మాణంతో స్థానిక ప్రజలు నిత్యం నరకం అనుభవిస్తున్నారు. కనీసం సర్వీసు రోడ్లు వేయకుండానే ఫ్లై ఓవర్‌ను కేంద్ర, రాష్ట్ర మంత్రులు అధికారికంగా ప్రారంభించి చేతులు దులుపేసుకున్నారు. ప్రధానంగా అంబర్ పేట ఛే నంబరు చౌరస్తా నుంచి గోల్నాక వెళ్లే సర్వీసు రోడ్డు అందుబాటులోకి రాకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురువుతున్నారు.



### హామీ ఇచ్చి...

అంబర్ పేట ఫ్లై ఓవర్ నిర్మాణానికి మొత్తం రూ.415 కోట్ల ఖర్చు కాగా, అందులో భూ నిర్వాసితుల కోసం జీహెచ్ఎంసీ నిధులు రూ.192 కోట్ల వాటాగా ఉంటే.. దాదాపు రూ.323 కోట్ల నిధులు నేషనల్ హైవే అథారిటీ వెచ్చించింది. 8 ఏండ్లుగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్న అంబర్ పేట వాసులకు ఇటీవల ఫ్లై ఓవర్ అందుబాటులోకి వచ్చినా ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది. ఇదిలా ఉంటే అంబర్ పేట ఛే నంబరు చౌరస్తా నుంచి గోల్నాక

– మిగతా II లో



## నగరంలో నకిలీ వైద్యులు

- చదివింది యునాని.. చేసేవి సిజేరియన్లు
- అర్హత లేకున్నా శస్త్ర చికిత్సలు
- ఆసుపత్రి నిర్వహణకు సర్టిఫికెట్ల కొనుగోలు
- నకిలీ పత్రాలతో చార్మినార్‌లో షహీన్ దవాఖాన నిర్వహణ
- అమాయకుల ప్రాణాలతో చెలగాటం
- అందిన కాడికి దండుకుంటున్న వైనం

IVలో

## ఇంటింటికీ ఉద్యమం

- ఎలివేటెడ్ కారిడార్ పరిహారం..
- వెడల్పుపై స్పష్టత ఇవ్వాల్సిందే
- ఇంటింటికీ రాజీవ్ రహదారి ఉద్యమం
- భూసేకరణపై కొలిక్కి రాకపోతే..
- నిరసనలు తప్పవని జేఏసీ హెచ్చరిక

సిటీబ్యూరో, జూన్ 15(నమస్తే తెలంగాణ): పరిహారం, రహదారి వెడల్పు తేలకుండానే హెచ్ఎండీఏ ఎలివేటెడ్ కారిడార్ విషయంలో ముందుకు సాగుతుండటంతో.... రాజీవ్ రహదారి బాధితులు ఉద్యమ బాట పట్టేందుకు సిద్ధమవుతున్నారు. భూసేకరణ వ్యవహారం కొలిక్కి రాకుండా, బాధితుల ప్రధాన డిమాండ్లను పరిష్కరించకుండానే ప్రాజెక్టును చేపట్టేలా వ్యవహరిస్తున్న ప్రభుత్వాన్ని ఉద్యమిస్తూనే ఎదుర్కొనేందుకు సన్నద్ధమవుతున్నారు. ఇందులో భాగంగా ఏర్పడిన రాజీవ్ రహదారి జేఏసీ ఆధ్వర్యంలోనే ఆందోళనలు, నిరసనలు, రాస్తారోకోలు, సీఎం రేవంత్‌రెడ్డికి తమ గోడును వినిపించేలా కార్యక్రమాలు నిర్వహించనున్నారు.



సమావేశంలో పాల్గొన్న రాజీవ్ రహదారి జేఏసీ నేతలు

### ఉద్యమానికి నిర్ణయం..

జేఏసీ నాయకులు తేలుకుంట సతీశ్, సభ్యుల ఆధ్వర్యంలో సమావేశమైన జేఏసీ సభ్యులు... ఉమ్మడి కార్యాచరణకు సిద్ధమవుతున్నారు. ఆదివారం ఉద్యమ బాట పట్టేందుకు సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఇప్పటికీ పార్టీలకతీతంగా తమ ఆవేదనను వివరించామని, తమకు మద్దతు తెలిపే పార్టీల సహకారంతో ఎలివేటెడ్ కారిడార్ ద్వారా జరుగుతున్న నష్టాన్ని ఎదుర్కొనేలా ఉద్యమించాలని తుది నిర్ణయం తీసుకున్నారు. ఎలివేటెడ్ కారిడార్ వెడల్పును 200 మీటర్ల నుంచి 100–150 మీటర్లకు తగ్గించడం, రక్షణ శాఖకు చెల్లిస్తున్నట్లుగానే పరిహారం వంటి ప్రధాన డిమాండ్ల సాధన కోసం జేఏసీ ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తున్నట్లు సభ్యులు పేర్కొన్నారు. ఇక ఇంటింటికి ఎలివేటెడ్ కారిడార్ ఉద్యమ కార్యాచరణను తీసుకెళ్లేలా కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు.

## భార్యతో పోరు పడలేక రౌడీషీటర్ ఆత్మహత్య

జియాగూడ, జూన్ 15 : భార్యతో నిత్యం గొడవలు జరుగుతూ ఉండడంతో ఓ రౌడీషీటర్ ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన కుల్సుంపురా పోలీస్ స్టేషన్ పరిధి లో ఆదివారం మధ్యాహ్నం చోటు చేసుకున్నది. ఎస్.ఐ.భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం పోలీస్ స్టేషన్ పరిధి లోని కేశవస్వామి నగర్ లో ఉంటున్న హత్వాల్ ఉమేశ్ (35)కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఉమేశ్ తరచూ గొడవలకు దిగుతున్న కారణంగా 2011 లో కుల్సుంపురా పోలీస్ స్టేషన్ లో రౌడీ షీటర్ గా నమోదయ్యాడు. అప్పటి నుండి గొడవలు, గంజాయి విక్రయాలు, హత్యలకు పాల్పడటంతో తరచూ జైలుకు వెళ్లి వస్తుండేవాడు. ఇతని పైన దాదాపు 17 కేసులు నమోదై ఉన్నాయి. కాగా గత కొంత కాలంగా ఇంట్లో భార్యతో గొడవలు జరుగుతున్నాయి. ఆదివారం కూడా ఏదో విషయమై ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఆ తర్వాత భార్య వంటింట్లో వంట చేస్తుండగా ఆ సమయంలో ఉమేశ్ బెడ్రూంలోకి వెళ్లి ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. ఎంత కొట్టినా తలుపు తీయకపోవడంతో అనుమానం వచ్చిన భార్య..స్థానికుల సహాయంతో తలుపులు బద్దలు కొట్టింది. కాగా అప్పటికే ఫ్యాన్‌కు ఉరేసుకున్న ఉమేశ్ కొన ఊపిరితో ఉన్నట్లు గుర్తించారు. వెంటనే ఉస్మానియా దవాఖానకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఉమేశ్ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

## పుణ్యస్నానానికి వెళ్లి..

గోదావరిలో మునిగి.. ఐదుగురు నగర వాసులు మృతి

IIలో



# ఆహార వ్యర్థాలతో బయోగ్యాస్!

- ఏటా రూ.50 వేల వరకు ఆదా
- ఉస్మానియా వర్సిటీ మహిళా హాస్టల్‌లో ఏర్పాటు
- ఎల్‌పీజీ, వంట చెరకు వాడకానికి స్వస్తి



సిటీ బ్యూరో, జనవరి 15 (నమస్తే తెలంగాణ): వండుకుని తినగా మిగిలిన ఆహార వ్యర్థాలనే గ్యాస్‌గా మార్చి వంట చేస్తున్నారు. ఆహార వ్యర్థాలతో బయోగ్యాస్ ఉత్పత్తి చేసి ఏకంగా 400 మందికి సరిపడా ఆహారాన్ని వండుతున్నారు. ఎల్పీజీ గ్యాస్, వంట చెరకుకు అయ్యే దాదాపు రూ. 50 వేల ఖర్చును ఆదా చేస్తున్నారు. ఈ వినూత్న పద్ధతిని ఉస్మానియా యూనివర్సిటీలోని మహిళల హాస్టల్‌లో వినియోగిస్తున్నారు. మహిళల మెస్‌లో వంట చేయడానికి ఆరు నెలలుగా ఆహార వ్యర్థాలతో తయారు చేసిన బయోగ్యాస్‌నే వాడుతున్నారు. ఖర్చుతో పాటు యూనివర్సిటీ పరిసరాలను శుభ్రంగా ఉంచుతున్నారు. ఈ బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటుకు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే పునాది పడింది. యూనివర్సిటీలోని అప్పటి అధికారులు ప్రతిపాదనలు చేసి, పనులు పూర్తి చేసి 2024 డిసెంబర్‌లో అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్రస్తుతం ఈ బయోగ్యాస్ ప్లాంట్ వందలాది మంది విద్యార్థులకు పర్యావరణహితమైన ఆహారాన్ని వండి వడ్డించేందుకు దోహదపడుతున్నది.

### ప్లాంట్ ద్వారా 300 నుంచి 400 మందికి వంట

బయోగ్యాస్ ప్లాంట్ నుంచి వచ్చే గ్యాస్‌ను వినియోగించేందుకు వంట గదుల్లో ప్రత్యేకమైన బయోగ్యాస్ స్టవ్‌లను ఏర్పాటు చేశారు. ప్లాంట్ నుంచి నేరుగా స్టవ్‌కి గ్యాస్ సరఫరా అవుతుంది. దీని ద్వారా నిత్యం 300 మంది నుంచి 400 మంది విద్యార్థులకు సరిపడా ఆహారాన్ని వండుతున్నట్లు ఉమెన్స్ హాస్టల్ డైరెక్టర్ కల్యాణలక్ష్మి తెలిపారు. ఈ బయో గ్యాస్ ద్వారా ఎల్‌పీజీ, వంట చెరకుకు అయ్యే రూ. 40 వేల నుంచి రూ.50 వేలను ఆదా చేస్తున్నామని వెల్లడించారు. హాస్టల్‌లోని ఒక కిచెన్‌లో నెలకు 19 గ్యాస్ సిలిండర్లు వాడేవారు. అదేవిధంగా 13.34 టన్నుల వంట చెరకును వినియోగించేవారు. ప్రస్తుతం పూర్తిగా ఈ ప్లాంట్ నుంచి వచ్చిన బయోగ్యాస్‌నే వాడుతున్నారు. ప్లాంట్ వినియోగంలోకి వచ్చిన ఆరు నెలల నుంచి క్యాంపస్ వాతావారణం పూర్తిగా మారిపోయిందని ఆమె చెప్పారు. గత అక్టోబర్ వరకు ఆహార వ్యర్థాల తొలగింపు ఒక సవాలుగా ఉండేదన్నారు. కొన్ని చోట్ల వ్యర్థాల వల్ల దుర్వాసన వెదజల్లేదని చెప్పారు. తీసుకెళ్లేవారు పూర్తిస్థాయిలో తొలగించకపోవడం వల్ల ఆ పరిస్థితి ఏర్పడేదని, ఇప్పుడు ఎలాంటి దుర్వాసన లేకుండా క్యాంపస్ ఆహ్లాదంగా ఉందన్నారు. ఇప్పుడు ఆహార వ్యర్థాల వినియోగాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తున్నామని వెల్లడించారు. ఈ బయోగ్యాస్ ప్లాంట్లను అన్ని యూనివర్సిటీల హాస్టళ్లలో ఏర్పాటు చేస్తే ఎల్‌పీజీ, వంట చెరకు వినియోగాన్ని తగ్గించి పర్యావరణానికి మేలు చేయవచ్చని చెప్పారు.

– మిగతా II లో

## 5 నెలలుగా జీతాల్లేవ్

IVలో

- వైద్యవిధాన పరిషత్‌లో పస్తులుంటున్న పారిశుధ్య, పేషెంట్ కేర్, సెక్యూరిటీ సిబ్బంది
- గత ప్రభుత్వంలో సకాలంలో వేతనాలు
- 6 నెలలకోసారి జీతాలిస్తున్న కాంగ్రెస్ సర్కారు
- అప్పులతో కుటుంబాలకు నెట్టుకొస్తున్న వైనం
- వేతనాలు వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి

